

క్రీడా సంబురం

గద్వాలలో సీబీఎస్‌ఈ దక్షిణ భారత సౌత్ జోన్–1 బాలుర కబడ్డీ టోర్నీ ప్రారంభమైంది.

వివరాలు 8లో ▸



సమస్యలు తీరేనా?

పాలమూరులోని ప్రధాన స్టేడియం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.1 /20.8

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గణనాథుడికి మంత్రి జూపల్లి పూజలు



కొల్లాపూర్: పట్టణంలోని గణనాథులను మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం రాత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవ కమిటీల ప్రతినిధులతో మాట్లాడారు. నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. గణనాథుడి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు.

శనేశ్వరుడికి తైలాభిషేకాలు



నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): మండలంలోని నందివడ్డెమాన్‌లో వెలసిన జేష్టాదేవి సమేత శనేశ్వరుడికి ఏలినాటి శనిదోష నివారణ కోసం భక్తులు తిలతైలాభిషేక పూజలు చేశారు. శనివారం తెల్లవారుజామున శనేశ్వరునికి ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తొలి పూజ చేసి భక్తుల చేత నువ్వులు, నువ్వుల నూనె, జిల్లేడు పూలతో అభిషేకాలు, ప్రదక్షిణలు చేయించారు. అనంతరం శివుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు శాంతికుమార్, ఉమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో 18 మంది ఉపాధ్యాయుల బదిలీ



వెల్దండ: హైకోర్టు ఉత్తర్వుల మేరకు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 18 మంది ఉపాధ్యాయులు ఏకకాలంలో బదిలీ అయ్యారు. మోడల్ స్కూల్‌లో 12 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేయడంతో.. రెండో శనివారం అయినప్పటికీ ఉపాధ్యాయులు బదిలీ ప్రాంతాలకు వెళ్లారు. బదిలీపై వెళ్తున్న వారికి ప్రిన్సిపల్ పుష్పలత ఉత్తర్వులు అందజేశారు. ఇందులో ప్రిన్సిపల్‌తోపాటు వైస్ ప్రిన్సిపల్ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు మల్లేష్, భిక్షయ్య, రమ, రవీందర్, రాఘవేందర్, సుభా, చంద్రారెడ్డి, నర్సింహులు, నర్సింహ, వెంకటేశ్వర్లు, మాధవి, ప్రవీణ్, మంజుల, విష్ణుప్రియ, దిల్‌షాద్‌బేగం వివిధ జిల్లాలోని మోడల్ స్కూళ్లకు బదిలీపై వెళ్లారు. సుమారు 12 ఏళ్లుగా కలిసి పనిచేసిన ఉపాధ్యాయులను వివిధ జిల్లాలకు బదిలీ చేయడంతో కన్నీరు పెట్టుకున్నారు. ఎక్కడున్నా వృత్తిరీత్యా బాధ్యతగా పనిచేస్తే మంచి గుర్తింపు వస్తుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.



↑ కొండారెడ్డిపల్లిలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ నూతన భవనం

కొంగొత్తగా.. కొండారెడ్డిపల్లి

సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామానికి దండిగా నిధులు

- ఇప్పటికే రూ.20 కోట్లు మంజూరు.. మరో రూ.170 కోట్లతో ప్రతిపాదనలు
- సోలార్ విద్యుత్ పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక
- వంగూరు మండలం వ్యాప్తంగా డబుల్ రోడ్ల నిర్మాణం
- దసరా నాటికి పూర్తిచేసేలా ముందుకు..

సాక్షి, నాగర్‌కర్నూల్/ వంగూరు: సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి రూపురేఖలు మార్చుకుంటోంది. కొండారెడ్డిపల్లితోపాటు వంగూరు మండలంలో విస్తృతంగా అభివృద్ధి పనులు చేపట్టడంపై అధికారులు దృష్టిసారించారు. వంగూరు మండల కేంద్రం నుంచి అన్ని గ్రామాలకు డబుల్ రోడ్డు సౌకర్యం కల్పించనున్నారు. కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధికి ఇప్పటికే రూ.30 కోట్లు మంజూరు కాగా.. మరో రూ.170 కోట్ల పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈసారి దసరాకు సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామానికి రానుండటంతో నెల రోజుల్లోనే పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. నెల రోజుల్లోనే ముఖ్యమైన పనులను పూర్తిచేసి గ్రామ స్వరూపాన్ని మార్చేలా ఏర్పాట్లు సాగుతున్నాయి.

సోలార్ విద్యుత్ ఆధారిత గ్రామంగా..

రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్ట్ కింద కొండారెడ్డిపల్లిని పూర్తిస్థాయిలో సోలార్ విద్యుత్ ఆధారిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ కొండారెడ్డిపల్లిని సందర్శించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి, వ్యవసాయ మోటారు కనెక్షన్‌కు సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి ఉచితంగా సోలార్ విద్యుత్ అందించనున్నారు. సోలార్ ద్వారా గృహ, వ్యవసాయ, వాణిజ్య అవసరాలకు వినియోగించడంతో పాటు మిగులు విద్యుత్‌ను విక్రయించి ఆదాయం పెంచుకునేలా చర్యలు చేపడుతున్నారు. గ్రామంలోని మొత్తం 499 గృహ విద్యుత్ వినియోగదారులు, 66 కమర్షియల్, 867 వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఈ ప్రాజెక్ట్ ద్వారా లబ్ధి చేకూరనుంది.

రోడ్లు, భవనాల నిర్మాణానికి..

వంగూరు మండల అభివృద్ధి కోసం రూ.30 కోట్ల నిధులు మంజూరు కాగా రూ.170 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపించారు. ఇదిలా ఉంటే కేవలం కొండారెడ్డిపల్లి అభివృద్ధి కోసమే దాదాపు రూ.50 కోట్లు మంజూరవగా.. పనులు ప్రారంభించారు. వంగూరు మండలానికి ప్రస్తుతం కల్వకుర్తి 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. 35 కి.మీ., దూరం ఉండటంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు మండలంలోని పోల్కంపల్లి పరిసరాల్లో రూ.45 కోట్లతో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే గాజర సమీపంలో రూ.2 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, మరో రూ.2 కోట్లతో కొండారెడ్డిపల్లిలో విద్యుత్ లైన్ల మార్పు కోసం ప్రతిపాదనలు పంపారు. వంగూరులో సమీకృత ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి రూ.66 కోట్లు, 30 పడకల ఆస్పత్రికి రూ.16 కోట్లు, వంగూరు నుంచి జూపల్లి వరకు బీటీ డబుల్ రోడ్డు కోసం రూ.7.3 కోట్లు, శ్రీశైలం నేషనల్ హైవే రాంనగర్ స్టేజీ నుంచి కొండారెడ్డిపల్లికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.5.12 కోట్లు, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల కోసం రూ.3 కోట్లతో ప్రతిపాదనలను సీఎం కార్యాలయానికి పంపించారు.

⇨ సర్వారెడ్డిపల్లి నుంచి వయా వంగూరు, కొండారెడ్డిపల్లి మీదుగా జంగారెడ్డిపల్లి వరకు బీటీ డబుల్ రోడ్డు కోసం రూ.30 కోట్లు మంజూరయ్యాయి. కొండారెడ్డిపల్లి గేటు నుంచి పోల్కంపల్లి వరకు నాలుగు లైన్ల రోడ్డు కోసం రూ.16 కోట్లు, పాఠశాలలో అదనపు గదులు, మరమ్మతు కోసం రూ.3.70 కోట్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.18 కోట్లు, పశువైద్యశాల నిర్మాణానికి రూ.45 లక్షలు, బీసీ కమ్యూనిటీ హాల్‌కు రూ.58 లక్షలు, లైబ్రరీ భవనానికి రూ.55 లక్షలు, పంచాయతీ భవనం, ప్రహరీ కోసం రూ.72 లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ హాల్ కోసం రూ.20 లక్షలు, బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్ 30 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన యూనిట్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు, మోడ్రన్ బస్‌షెల్టర్ నిర్మాణానికి రూ.24 లక్షలు, బీసీ కమ్యూనిటీ హాల్ ప్రహరీకి రూ.12 లక్షలు, చిన్నపిల్లల ఆట స్థలం కోసం రూ.14 లక్షలు, రైతువేదిక ఆధునికీకరణ కోసం రూ.19 లక్షలు, ఓపెన్ జిమ్ కోసం రూ.18 లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ హాల్ మరమ్మతు కోసం రూ.9 లక్షలు, విద్యుత్ లైన్ల మార్పు, కొత్త లైన్ల ఏర్పాటు కోసం రూ.2.85 కోట్లు, మెయిన్ రోడ్డులో ఎల్‌ఈడీ వీధిదీపాల ఏర్పాటుకు రూ.40 లక్షలు, చెట్లు, గ్రీనరీ ప్లాంటేషన్ కోసం రూ.20 లక్షలు మంజూరయ్యాయి.

ఆలయ నిర్మాణానికి సొంత నిధులు

సీఎం రేవంత్‌రెడ్డి తన స్వగ్రామంలోని ఆంజనేయస్వామి, శివాలయాల నిర్మాణం కోసం రూ.4 కోట్ల వరకు సొంత నిధులు వెచ్చించనున్నారు. గ్రామంలో ఇప్పటికే ఉన్న పాత హనుమాన్ ఆలయాన్ని పూర్తిగా తొలగించి కొత్తగా నిర్మిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏదైనా కార్యక్రమం చేపట్టినప్పుడు ముందుగా ఈ ఆలయంలోనే పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలోనే హనుమాన్ ఆలయ పునర్నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు.

నెలరోజుల్లో పూర్తిచేసేలా..

కొండారెడ్డిపల్లి, వంగూరు మండలంలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయడంపై కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఇప్పటికే పలుమార్లు క్షేత్రస్థాయిలో గ్రామాన్ని సందర్శించి పనుల వేగవంతానికి సూచనలు చేశారు. కొండారెడ్డిపల్లిలో అభివృద్ధి పనుల పర్యవేక్షణను ప్రత్యేకంగా జిల్లా వెటర్నరీ అధికారి రమేష్ పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ ఇప్పటికే మూడుసార్లు కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధిపై సమీక్ష జరిపారు.



కొండారెడ్డిపల్లిలో పర్యటిస్తున్న టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, కలెక్టర్ బదావత్ సంతోష్ తదితరులు (ఫైల్)

సీఎంకు కృతజ్ఞతలు

వంగూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని శనివారం కొండారెడ్డిపల్లి గ్రామస్తులు కలిశారు. సోలార్ విద్యుత్ పైలెట్ ప్రాజెక్టు కింద కొండారెడ్డిపల్లిని ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన కడారి రమేష్ పంచాయతీరాజ్ ఏఈగా ఎంపికవగా.. ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. సీఎంను కలిసిన వారిలో వేమారెడ్డి, వంశీ తదితరులున్నారు.



ఆత్మ.. అంతంతే

ఆధునిక వ్యవసాయంపై అందని సూచనలు, సలహాలు



- ప్రతి ఏటా అరకొరగానే నిధుల కేటాయింపు
- నిధులు మంజూరు చేసినా సిబ్బంది జీతాలకే సరి
- క్షేత్రస్థాయిలో నీరుగారుతున్న పథకం లక్ష్యం

నాగర్‌కర్నూల్: సంప్రదాయ వ్యవసాయ సాగుకు స్వస్తి పలుకుతూ.. వ్యవసాయ రంగంలో యంత్ర పరికరాల భాగస్వామ్యం పెంచేందుకు 2001లో అప్పటి కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రారంభంలో ఈ పథకానికి మంచి ఆదరణ ఉన్నా రాన్రాను ప్రభుత్వాలు పథకానికి సరిపడా నిధులు మంజూరు చేయకపోవడంతో పథకం లక్ష్యం నీరుగారిపోతుంది. ఫలితంగా అన్నదాతకు మాత్రం ఆధునిక వ్యవసాయంపై సలహాలు, సూచనలు అందడం లేదు. దీంతో జిల్లాలో పంటల సాగు లాభసాటిగా మారేలా కనిపించడం లేదు.

ఇదీ పథకం ఉద్దేశం..

2001లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రతి వ్యవసాయ డివిజన్‌ను బ్లాక్‌గా పరిగణించి.. రైతులు, అధికారులతో కలిసి సలహా కమిటీని ఏర్పాటు చేస్తారు. యువజన సంఘాలు, మహిళా మండలి సభ్యులు, ఎరువుల దుకాణాల డీలర్లు తదితరుల భాగస్వామ్యంతో 20 నుంచి 24 మంది సభ్యులతో కమిటీని నియమిస్తారు. ఇందులో ఏడీఏ కన్వీనర్‌గా మిగతా వారు సభ్యులుగా ఉంటారు. డివిజన్ కమిటీల నుంచి ఇద్దరు, ముగ్గురిని తీసుకుని జిల్లా రైతు సలహా కమిటీని ఏర్పాటు చేస్తారు. దీనికి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అయితే డివిజన్ స్థాయి కమిటీలో చర్చించి రైతులకు నూతన సాగు సలహాలు, అందించేందుకు అవసరమయ్యే శిక్షణ, క్షేత్రస్థాయి పర్యటన, విజ్ఞాన యాత్రలు నిర్వహించాలి. మండల స్థాయిలో రైతులకు విత్తనోత్పత్తి, చీడపీడల నివారణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చి చైతన్యం తేవాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతి ఆర్థిక సంవత్సరంలో ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారు.

నాలుగేళ్లు అవుతోంది..



జిల్లాలో 8 మంది ఆత్మ సిబ్బంది ఉన్నారు. వారిని ప్రస్తుతం ఏఈఓలు అందుబాటులో లేనిచోట ఏఈఓలుగా వాడుకుంటున్నాం. ఆత్మ పథకానికి నిధులు మంజూరు కాక దాదాపు నాలుగేళ్లు అవుతుంది. అలాగే సిబ్బందికి మే నెల వరకు జీతాలు వచ్చాయి. జూన్ నెల జీతం కూడా త్వరలోనే జమ చేయడం జరుగుతుంది.

– చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి

ఏళ్లతరబడిగా ఎదురుచూపులు..

గత కొన్నేళ్లుగా ఆత్మ కమిటీలకు అరకొరగా నిధులు మంజూరు చేయడంతో పథకం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు. ప్రతి ఏటా అధికారులు ప్రతిపాదనలు పంపినా కూడా నిధులు మాత్రం అరకొరగానే మంజూరవుతున్నాయి. దీంతో చేసేదేమి లేక పథకాన్ని బలవంతంగానే కొనసాగిస్తున్నారు. ఆత్మ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా ఏటీఎం, బీటీఎం, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులతో ఉద్యోగులు ఉంటారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నాలుగు డివిజన్‌లలో కలిపి 8 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరికి మే నెల వరకు జీతాలు రాగా.. జూన్, జూలై, ఆగస్టుకు సంబంధించిన మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఆత్మ పథకానికి సంబంధించి కార్యక్రమాల నిర్వహణకు ఏడాదికి రూ.15 లక్షలు ప్రభుత్వం నుంచి ప్రతి ఏటా మంజూరు కావాల్సి ఉండగా చివరగా 2019– 20 ఆర్థిక సంవత్సరంలోనే నిధులు మాత్రమే మంజూరయ్యాయి. తర్వాత కేటాయింపులు లేకపోవడంతో రైతులకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. సిబ్బంది జీతాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాల్సి ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో పథకం నిర్వహణకు మంజూరు చేసిన నిధుల నుంచే జీతాలు చెల్లించాల్సి వస్తోంది.

ధాన్యం తరలింపు టెండర్ల రద్దు

- ఈనెల 11న టెండర్ వేయకుండా మహిళ అడ్డగింత
- హైకోర్టును ఆశ్రయించిన బాధితురాలు

వివరాలు 10లో ▸



మాజీ మంత్రికి పరామర్శ



మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి అకాల మరణం ఎంతో బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం ఆయన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వివేకానందగౌడ్, కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బాల్క సుమన్, తదితరులతో కలిసి తిమ్మాజిపేట మండలం ఆవంచలోని లక్ష్మారెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

సీఎం పర్యటనకు 387 మందితో బందోబస్తు

మహబూబ్‌నగర్ క్రైం/ దేవరకద్ర: జిల్లాలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. సీఎం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి దశదినకర్మ కార్యక్రమానికి దమగ్నాపూర్‌కు రానుండటంతో పెద్దవడ్డెమాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బందోబస్తుకు కేటాయించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ జానకి ప్రత్యేక సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. ప్రధానంగా పార్కింగ్ విధుల్లో ఉండే సిబ్బంది సమన్వయం పాటించాలని సూచించారు. సీఎం పర్యటన బందోబస్తు కోసం ఇద్దరు ఏఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 30 మంది ఎస్‌ఐలు, 98 మంది ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 190 మంది కానిస్టేబుళ్లు, 50 మంది హోంగార్డులను బందోబస్తు కోసం కేటాయించారు.

హెలీప్యాడ్ పరిశీలించిన డీఐజీ

దమగ్నాపూర్ వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ జానకి ఇతర పోలీసులు అధికారులు పరిశీలించారు. ఎమ్మెల్యే ఇంటి పరిసరాలను తమ స్వాధీనంలో తీసుకుని అణువణువును తనిఖీ చేస్తున్నారు. సీఎం వచ్చి పోయే వరకు పటిష్ట బందోబస్తు కల్పించాలని డీఐజీ సూచించారు.

పర్యటన వివరాలు ఇలా..

⇨ సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం 11.30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరుతారు. 12.10 గంటలకు దమగ్నాపూర్‌కు చేరుకుంటారు.

⇨ 12.15 గంటలకు దమగ్నాపూర్‌లోని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఇంటికి వస్తారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎమ్మెల్యే తండ్రి కృష్ణారెడ్డి దశదినకర్మలో పాల్గొంటారు.

⇨ ఒంటిగంటకు తిరిగి హెలీకాప్టర్‌లో హైదరాబాద్ బయలుదేరుతారు.



దమగ్నాపూర్ వద్ద హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ జానకి తదితరులు

క్లుప్తంగా

యువరైతు ఆత్మహత్య



గట్టు: రాయపురం గ్రామానికి చెందిన యువ రైతు గొల్ల గోకారి (30) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గోకారి(30) ఉదయం 10 గంటల ప్రాంతంలో భార్య మల్లమ్మతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో వ్యవసాయ పొలానికి వెళ్లి క్షణికావేశంలో పత్తి పంటకు ఉపయోగించే క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన అతడి భార్య గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి గోకారి గద్వాల ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. గోకారికి భార్య మల్లమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అతడి తండ్రి తాయప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మల్దకల్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని మేకలసోంపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ ఈశ్వరయ్య వివరాల మేరకు.. మేకలసోంపల్లి గ్రామానికి చెందిన పద్మనాభరావు తనకున్న కొద్దిపాటి పొలంలో పంటను సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రోజులాగే శనివారం పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. బోరు మోటారు ఆన్ చేస్తున్న క్రమంలో అప్పటికే అక్కడ గాలికి తెగి పడిన విద్యుత్ తీగను గమనించక పోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆటో ఫైనాన్స్ కట్టలేక యువకుడి ఆత్మహత్యాయత్నం



వడ్డె నర్సింలు

గండేడ్: ఆటో ఫైనాన్స్ డబ్బులు కట్టలేక ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పగిడ్యాల్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గండేడ్ మండలంలోని పగిడ్యాల్ గ్రామానికి చెందిన వడ్డె నర్సింలు ఇటీవల ఉపాధి నిమిత్తం ఫైనాన్స్‌లో ఆటో కొనుగోలు చేశాడు. ఆటో సరిగ్గా నడవకపోవడంతో వాయిదాలు కట్టలేకపోయాడు. దీంతో మనస్థాపానికి గురై శనివారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో అతడిని గండేడ్ పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

యువతి హత్య కేసును ఛేదించిన పోలీసులు

- నిందితుడిని రిమాండ్‌కు తరలింపు

బల్మూర్: మండల కేంద్రంలో ఊర చెరువులో ఈనెల 7న లభ్యమైన గుర్తు తెలియని యువతి హత్య కేసును పోలీసులు ఛేదించారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్‌ఐ గురుస్వామి శనివారం వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన సొంటే శివరాములు హైదరాబాద్‌లో ప్లంబర్ వర్క్ చేస్తుండగా, నాగోల్‌లో అనూష అనే అమ్మాయితో పరిచయం ఏర్పడింది. వీరు ఎనిమిది నెలలుగా సహ జీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో నిందితుడు గత కొంత కాలంగా స్వగ్రామమైన బల్మూర్‌కు వచ్చాడు. తనను పెళ్లి చేసుకోవాలని ఫోన్ చేసి అనుష నిలదీయడంతో శివరాములు బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్లాడు. ఆమెను బల్మూర్‌కు తీసుకొచ్చి గ్రామ ఊర చెరువు వద్ద గొంతు నుమిలి హత్య చేశాడు. అనంతరం ఆమె మృతదేహాన్ని చెరువులో వేసి పరారయ్యాడు. ఈ సంఘటనపై పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేయగా అనూషను తానే హత్య చేసినట్లు అంగీకరించడంతో కోర్టులో హాజరు పరిచారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన ప్రిన్సిపాల్



నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): పాఠశాలకు ఆలస్యంగా వస్తున్నాడని విద్యార్థిని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బాదాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గౌరారానికి చెందిన పెద్దబురాన్ కుమారుడు సురేందర్ మండల కేంద్రంలోని మేధాన్స్ అనే ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం పాఠశాలకు ఆలస్యంగా వచ్చాడని ప్రిన్సిపాల్ రమేష్ ఆగ్రహంతో సురేందర్‌ను కర్రతో చితకబాదాడు. దీంతో విద్యార్థి తొడలపై వాతలు పడ్డాయి. విద్యార్థి తల్లిదండ్రులు ఆ పాఠశాల యజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఆ విద్యార్థి పదో తరగతి కావడంతో చదువులో మెరుగైన ఫలితాలు సాధించేలా చూడాలని, క్రమశిక్షణలో పెట్టే క్రమంలో ఇలా జరిగిందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ శనివారం వివరణ ఇచ్చారు.

సమస్యలు తీరేనా?



ఇటీవల కురిసిన వర్షానికి చెరువును తలపిస్తున్న జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియం(ఫైల్)

- వర్షం వచ్చిన ప్రతిసారి ప్రధాన స్టేడియంలో నిలుస్తున్న నీరు
- చెరువును తలపిస్తున్న పరిసరాలు
- స్టేడియం యథాస్థితికి వచ్చే వరకు వాకింగ్, క్రీడలు బంద్
- ఆవేదన వ్యక్తం చేస్తున్న క్రీడాభిమానులు



వాకింగ్ ట్రాక్‌పై నిలిచిన వర్షపు నీరు(ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాకు పాలమూరులోని ప్రధాన స్టేడియం తలమానికంగా నిలుస్తోంది. ఇక్కడ ఎన్నో జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు జరిగాయి. స్టేడియం ఆవరణలో ఇప్పటికే అధునాతనమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణమైంది. వాలీబాల్ అకాడమీ కూడా ఏర్పాటైంది. ప్రతిరోజూ స్టేడియంలో ఉదయం, సాయంత్రం వందలాది మంది వాకింగ్ చేస్తుండగా.. మరెంతో మంది క్రీడాకారులు వివిధ క్రీడలను ప్రాక్టీస్ చేస్తున్నారు.

వర్షం వస్తే అంతే..

ప్రధాన స్టేడియానికి వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడంలేదు. ఎక్కడికక్కడ వర్షం నీరు నిలుస్తుంది. గత నెల కురిసిన వర్షానికి ప్రధాన స్టేడియం నీటితో నిండింది. వర్షపు నీటితో స్టేడియం చిన్నపాటి చెరువును తలపించింది. స్టేడియంలోని వర్షం నీరు బయటికు వెళ్లడానికి ఎలాంటి అవకాశం లేకపోవడంతో వర్షం ఎప్పుడు కురిసినా నీరు నిల్వ ఉంటుంది. పెద్ద చెరువుకు సంబంధించిన కాల్వ స్టేడియం ప్రహరీ సమీపంలో ఉండటంతో ఆ కాల్వ నిండిపోయి నీరంతా స్టేడియం ఆవరణలోకి వస్తున్నాయి. దీంతో ఖోఖో, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ కోర్టులు, వాకర్ ట్రాక్‌లు నీటితో నిండిపోయాయి.

వాకింగ్, క్రీడలకు అంతరాయం

వర్షం వస్తే స్టేడియంలో వాకింగ్ చేయడానికి, క్రీడలను ప్రాక్టీస్ చేయడానికి అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా అథ్లెటిక్స్ క్రీడాకారులు ప్రాక్టీస్ చేయడానికి తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షం వచ్చిన రోజు స్టేడియంను బంద్ పెడుతున్నారు. నీరంతా తొలిగిపోయిన తర్వాత అనుమతిస్తున్నారు.

నీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం..



ప్రధాన స్టేడియంలో వర్షం నీరు చేరిన వెంటనే తీసివేసే చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల కురిసిన భారీ వర్షానికి స్టేడియంలో ఎక్కువ మొత్తంలో నీరు చేరుతుంది. పెద్దచెరువు కాల్వ నిండి స్టేడియంలోకి నీరు వస్తుంది. వెంటనే ఈ విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వాకర్లు, క్రీడాకారుల ప్రాక్టీస్‌కు ఇబ్బందులు లేకుండా వర్షపు నీటి నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తీసివేసే చర్యలు చేపడుతున్నాం. – ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

ప్రదర్శనశాలకు రంగులు వేయించిన అధికారులు



మ్యూజియానికి రంగులు వేయిస్తున్న ఆలయ ఈఓ పురేందర్

జోగుళాంబ శక్తిపీఠం: 'ప్రదర్శనశాలపై పట్టింపు ఏది' అంటూ సాక్షి దినపత్రికలో శనివారం వెలువడిన కథనంపై జోగుళాంబ దేవస్థానం ఈఓ పురేందర్‌కుమార్ స్పందించారు. తాను కలెక్టర్‌కు హామీ ఇచ్చినట్టు మ్యూజియానికి దేవస్థానం తరపున రంగులు వేయించారు. ఈ మేరకు వారు శనివారం పేయింటర్స్‌ను పిలిపించి మ్యూజియానికి రంగులు వేయించారు. యాత్రికులు మ్యూజియంను గుర్తించే విధంగా దేవస్థానం తరపున బోర్డు కూడా ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ మాట్లాడుతూ ఇక్కడి మ్యూజియం రాష్ట్ర పురావస్తు శాఖకు చెందినదన్నారు. వారికి ఆదాయం లేక పోవడంతో దేవస్థానం తరపున తాము రంగులు వేయించి సూచిక బోర్డును ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి పరామర్శ



కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

చిన్నచింతకుంట/స్టేషన్ మహబూబ్‌నగర్: ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలు దమగ్నాపురం విచ్చేశారు. కృష్ణారెడ్డి చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మహబూబ్‌నగర్‌కు ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులకు రాజగోపాల్‌రెడ్డికి పరిచయం చేశారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, నాయకులు సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన క్రీడా సంబురం



క్రీడా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

గద్వాలటౌన్: అక్కడ క్రీడా చైతన్యం వెల్లివిరిసింది. విద్యార్థులు క్రీడా ప్రతిభను పెంపొందించుకోవడానికి క్రీడాకారులు నడుం బిగించారు. విజేతగా నిలువడం కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీ పడ్డారు. స్థానిక ఎస్ఆర్ విద్యానికేతన్ క్రీడామైదానంలో నిర్వహించిన క్రీడా సంబరం అంబరాన్ని తాకింది. సీబీఎస్ఈ దక్షిణ భారత సౌత్‌జోన్–1 అండర్–14, అండర్–17, అండర్–19 బాలుర కబడ్డీ టోర్నీ శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ జిల్లాల సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన 46 బాలుర జట్లు పోటీలో పాల్గొన్నాయి. సుమారు 500 మంది క్రీడాకారులు టోర్నీకి తరలి వచ్చారు. క్రీడాధికారులు శాంతిక పోతాలను, రంగురంగు బెలూన్లను ఆకాశంలోకి ఎగరేసి కబడ్డీ టోర్నీని లాంఛనంగా ప్రారంభించారు. సీనియర్ క్రీడాకారులు క్రీడాజ్యోతితో స్టేడియం చుట్టూ ర్యాలీ నిర్వహించి స్ఫూర్తిని నింపారు. అనంతరం సీబీఎస్ఈ దక్షిణ భారత సౌత్‌జోన్–1 క్రీడల పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడలను ప్రారంభించిన వెంటనే పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చారు.

అట్టహాసంగా కబడ్డీ పోటీలు ప్రారంభం

క్రీడా స్ఫూర్తితో ఉన్నత శిఖరాలు

ప్రతి క్రీడాకారుడికి క్రీడా స్ఫూర్తి ముఖ్యమని, దీని వల్లే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్ అభిప్రాయపడ్డారు. కబడ్డీ టోర్నీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు జాతీయస్థాయి పోటీలను లక్ష్యంగా నిర్దేశించుకొని ఆడాలని, క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు, మానసిక దృఢత్వం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాముడు, ప్రిన్సిపల్ వినోజ్ పాల్గొన్నారు.

'విద్యాబోధనలో మానవతా విలువలు ముఖ్యం'



సదస్సును ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ కేవీ ఆత్రేయ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రస్తుత విద్యా బోధనలో మానవతా విలువలు ఎంతో అవసరమని విద్యావేత్త, ప్రొఫెసర్ కేవీ ఆత్రేయ అన్నారు. శనివారం స్థానిక వేంకటేశ్వరకాలనీలోని శ్రీ సత్యసాయి మందిరంలో సుమారు 300 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలతో పాటు సమాజంలో వస్తున్న మార్పులను వివరించాలన్నారు. ముఖ్యంగా వాస్తవ పరిస్థితులను తెలియజేయాలన్నారు. వినయం, సంఘంలో గౌరవం తదితర అంశాలను బోధించాలన్నారు. పిల్లల మనస్తత్వానికి అనుగుణంగా, వారికి సులువుగా అర్థమయ్యేలా చెప్పాలన్నారు. కార్యక్రమంలో సత్య సాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు సాయిబాబ, సభ్యులు హనుమంత్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, కైలాస్, మనోహర్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మృతదేహంతో రోడ్డుపై ధర్నా



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ నాగేశ్వర్ రెడ్డి

నిందితులను అరెస్టు చేయాలంటూ ఆందోళన

మల్దకల్ : నిందితులను అరెస్టు చేయాలంటూ మృతదేహంతో బాధిత కుటుంబం రోడ్డుపై ధర్నాకు దిగిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మద్దెలబండకి చెందిన నర్సింహులు శుక్రవారం అనుమానాస్పదంగా వ్యవసాయ పొలం వద్ద మృతి చెందాడు. ఈ విషయమై అతడి తండ్రి పెద్ద నర్సింహులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా వారు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా నర్సింహులును హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ బాధిత కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో మృతదేహంతో మల్దకల్ బస్టాండు చౌరస్తాలోని అయిజ– గద్వాల ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. హత్య చేసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరు వద్ద మృతదేహంను పడవేసి విద్యుత్ ప్రమాదంతో మృతి చెందినట్లు చిత్రీకరించారని ఆరోపించారు. కాగా నిందితులను అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ ఈశ్వరయ్య ఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో ధర్నా విరమించే విధంగా నచ్చచెప్పారు. అయినప్పటికీ వారు వినలేదు. నిందితులను అరెస్టు చేయాలని అప్పటివరకు ధర్నా విరమించే ప్రసక్తే లేదని అన్నారు. తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యలకు పాల్పడతామని పోలీసులకు తెలపడంతో వారు ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. వెంటనే గద్వాల సీఐ నాగేశ్వర్‌రెడ్డి అక్కడికి చేరుకొని వారితో మట్లాడారు. అక్కడి నుంచే డీఎస్పీ సత్యనారాయణతో ఫోన్‌లో మాట్లాడించారు. నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకొని న్యాయం జరిగేలా చూస్తామని భరోసానివ్వడంతో బాధితులు ధర్నాను విరమించారు. నాలుగు గంటల పాటు రోడ్డుపై ధర్నా చేయడంతో వివిధ గ్రామాలకు వెళ్లే బస్సులలోని ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అలంపూర్, శాంతినగర్ సీఐలు రవిబాబు, టాటాబాబు, అయిజ, గద్వాల ఎస్‌ఐలు ఉన్నారు.

త్వరలో పాలమూరు ప్రాజెక్ట్ సందర్శనకు బీఆర్‌ఎస్ బృందం: కేటీఆర్

- ప్రాజెక్ట్‌ను తొక్కిపెడుతున్న తీరును ప్రజలకు చూపుతాం
- మహబూబ్‌నగర్‌లో పేదల ఇళ్లు కూల్చడం దుర్మార్గం

సాక్షి, నాగర్‌కర్నూల్: మేడిగడ్డ తరహాలో త్వరలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను బీఆర్‌ఎస్ బృందం సందర్శిస్తుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. పాలమూరు ప్రాజెక్ట్‌ను పూర్తిచేయకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం తొక్కిపెడుతున్న తీరును బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు, పార్టీ నాయకులతో కలసి ఎండగడతామని చెప్పారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటలోని ఆవంచలో మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డిని కలసి పరామర్శించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి స్వగ్రామం నేరళ్లపల్లిలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ ఇప్పటి వరకు 90 శాతం పూర్తయిందని, ఇంకా పది శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని చెప్పారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన రిజర్వాయర్ల నిర్మాణం పూర్తికాగా, కాల్వల నిర్మాణపనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. కేవలం రూ.5 వేల ఖర్చుతో ప్రాజెక్ట్ తుదిదశకు చేరుకుంటుదని వెల్లడించారు. గత తొమ్మిది నెలలుగా పాలమూరు ప్రాజెక్ట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రాజెక్ట్ పూర్తయితే కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే తొక్కిపెడుతున్నారని విమర్శించారు. పాలమూరు బిడ్డగా చెప్పుకునే రేవంత్‌కు ఈ ప్రాంతంపై ప్రేమ లేదన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 4 వేల మందికి డబుల్ ఇళ్లను ఇచ్చిందని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో పేదలకు ఇచ్చిన భూమిలోని ఇళ్లను రేవంత్ సర్కారు బుల్డోజర్లతో కూల్చివేసిందని మండిపడ్డారు. గత ఆగస్టు 29న ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తెల్లవారుజామున 3 గంటలకు 75 ఇళ్లను కూల్చడం దుర్మార్గమని అన్నారు. రోడ్డున పడ్డ పేద కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర రెడ్డి, బాల్క సుమన్ పాల్గొన్నారు.

పెన్షన్ బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల రిటర్మెంట్ బెనిఫిట్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు.

లక్ష్మీదేవమ్మ జీవితం సమాజానికి అంకితం

మెడికల్ కళాశాలకు భౌతికకాయం అప్పగింత

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కమ్యూనిస్టుల జీవితాలు సమాజానికి వెలుగులని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకురాలు, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు లక్ష్మీదేవమ్మ హైదరాబాద్‌లో మృతి చెందగా.. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయానికి ఆమె పార్థీవ దేహాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పార్టీలకతీతంగా ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు. ఎన్నో పోరాటాలు చేసి సమాజానికి మేలు చేసిన కమ్యూనిస్టు నాయకురాలు మరణించడం తీరని లోటన్నారు. లక్ష్మీదేవమ్మ తన జీవితం మొత్తం పార్టీ కోసం, పేదల కోసం అంకితమిచ్చారని పలువురు కొనియాడారు. అనంతరం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆమె పార్థీవదేహాన్ని మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాలకు అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధానకార్యదర్శి ఎ.సంజీవ్ ముదిరాజ్, న్యాయవాది బెక్కెం జనార్దన్, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర నాయకులు ఆశాలత, సీపీఎం నాయకులు రాములు, పర్వతాలు, వెంకట్రాంరెడ్డి, పుట్ట అంజనేయులు, రాంరెడ్డి, పద్మ, నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



లక్ష్మీదేవమ్మ పార్థివ దేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తదితరులు

క్లుప్తంగా

వికలాంగులకు కొత్త పింఛన్ అమలు చేయాలి

మన్ననూర్: వికలాంగులకు కొత్త పింఛన్ అమలు చేయాలని ఆసంఘం హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సదరం క్యాంపులు ఏర్పాటు చేసి వికలత్వంకు సంబంధించిన ధ్రువపత్రాలు ఇవ్వాలని కోరారు. ఉచిత బస్ పాస్, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మంత్రికి వినతి

కొల్లాపూర్: పట్టణంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి వద్ద జర్నలిస్టులు మంత్రిని కలిశారు. పట్టణ సమీపంలోని చౌటబెట్ల శివారులో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమి వివరాలు మంత్రికి తెలిపారు. అర్హులైన వారందరికీ పట్టాలు ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రి స్పందిస్తూ స్థలాన్ని పరిశీలించి, జర్నలిస్టులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ సమక్షంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) సంఘంలో చేరారు. ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సురేష్, కోశాధికారి నర్సింహ, సభ్యులు వినోద్, పుల్లయ్య, రామ్‌రెడ్డి, కేశవులు, రాజేష్, వెంకటేష్, చాంద్‌పాషా, రమేష్, శేఖర్ తదితరులున్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలకు విద్యార్థుల ఎంపిక



వెల్దండ: మండల కేంద్రంలో ఇటీవల మోడల్ స్కూల్ ఆవరణంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడల్లో ఏకలవ్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి జోనల్ క్రీడలకు 32 మంది ఎంపిక అయ్యారు. కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో పోటీల్లో ప్రతిభ కనబర్చారు. త్వరలో కల్వకుర్తి మండలం మార్చాల నిర్వహించే జోనల్ పోటీల్లో పాల్గొంటారని వైస్ ప్రిన్సిపాల్ సుమన్ తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగంలో జట్లకు ఎంపికైన విద్యార్థులను శనివారం ఉపాధ్యాయ బృందం అభినందించారు. భాస్కర్, పీఈటీలు రాణిదేవి, ఆశిష్ యాదవ్, తదితరులు ఉన్నారు.

వాగుపై తాత్కాలిక మరమ్మతు చేపట్టాలి



కోడేరు: మండలంలోని ఖానాపూర్ వాగుపై తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని ఆ ప్రాంత రైతులు ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు. భారీ వర్షాల కారణంగా బావాయిపల్లి వాగు నుంచి కోడేరు, ఖానాపూర్ వాగుకు వరద ఉధృతంగా రావడంతో గతంలో గూనలు వేసి తాత్కాలిక మరమ్మతు చేపట్టడంతో వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో రైతులు ఇతర గ్రామాలకు వెళ్లే మహాసముద్రం, గంట్రావుపల్లి వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వాగుపై తాత్కాలిక మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోగులకు వైద్యం అందేనా?

- ఆస్పత్రిలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- సీజనల్ వ్యాధులతో అవస్థలు

వెల్దండ: రోజురోజుకూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. పలు గ్రామాల నుంచి అధికసంఖ్యలో మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలివస్తున్నారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నామని పాలకులు చెప్తున్నా క్షేత్రస్థాయిలో విరుద్ధంగా ఉంది. సరైన వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు.

వైద్యులు లేక అవస్థలు..

ప్రతి రోజు ఆస్పత్రికి 100 నుంచి 150 మంది రోగులు వస్తుంటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఆరుగురు ఏఎన్‌ఎంలు, వాచ్‌మెన్‌పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కనీసం ఒక్క డాక్టర్ కూడ నియమించకపోవడంతో వైరల్‌ఫీవర్, డెంగీ, చికున్‌గున్యా, తదితర వ్యాధులబారిన పడినవారు ఇబ్బందులు అంతాఇంతా కాదు. సీజనల్ వ్యాధులు సోకడంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వైద్యులు లేకపోవడంతో జిల్లా అధికారులు పల్లెదవాఖాన సిబ్బందితో నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితిలో రోగులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలివెళ్తున్నారు. మండలంలో 32 గ్రామ పంచాయతీలు, మరో 10 అనుబంధ గ్రామాలు, దాదాపుగా 22 గిరిజన తండాలు ఉన్నాయి. దాదాపుగా 4 నెలలుగా డాక్టర్లు లేకపోవడంతో పట్టించుకునే వారు కరువయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారి కావడంతో ప్రతి నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గాయపడిన వారిని ఆస్పత్రికి తీసుకెళ్తే డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్సలు చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



వెల్దండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



వెల్దండలో డాక్టర్ లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

తగ్గిన కాన్పులు..

ఆస్పత్రిలో డాక్టర్లు లేకపోవడంతో కాన్పుల సంఖ్య తగ్గింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ దశలో ఉండడంతో తాత్కాలికంగా మండల మహిళ సమాఖ్య భవనంలో ఆస్పత్రిని కొనసాగిస్తున్నారు. ఇక్కడ సరైన వసతులు లేకపోవడంతో పాటు డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాత్రివేళలో గర్భిణులు కల్వకుర్తి, ఆమనగల్లు పట్టణాలకు తరలివెళ్తున్నారు.

ఉపకేంద్రాల్లో సిబ్బంది కొరత

మండలంలోని ఆయా గ్రామాల్లో ఏడు ఉప కేంద్రాలు ఉన్నాయి. అవి బైరాపూర్, కుప్పగండ్ల, బొల్లంపల్లి, చెర్కూర్, తాండ్ర, కొట్ర, వెల్దండలలో సబ్‌సెంటర్లు ఉన్నాయి. వీటి మొదటి ఏఎన్‌ఎం, రెండో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు ఉండాలి. కాని కొన్ని కేంద్రాలకు కేవలం రెండో ఏఎన్‌ఎం మాత్రం ఉండడంతో గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు.

మందులు ఇచ్చే వారు లేరు..



ఆస్పత్రిలో డాక్టర్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. మారుమూల తండా నుంచి వస్తే మందులిచ్చే వారు కూడా లేరు. ప్రైవేట్‌లో వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఉంది. సీజనల్ వ్యాధులబారిన పడతున్నాం. వెంటనే డాక్టర్‌ను నియమించాలి.

– కేతావత్ లక్ష్మి, ఉప్పబోర్డుతండా, వెల్దండ

త్వరలోనే డాక్టర్‌ను నియమిస్తాం..

పీహెచ్‌సీలో విధులు నిర్వహించే వైద్యుడు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతానికి రోగులకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక డాక్టర్లతో సేవలందిస్తున్నాం. ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయి. ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం.

– భీమానాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, నాగర్‌కర్నూల్

వైభవంగా వినాయక ఉత్సవాలు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో శివజ్యోతి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద శనివారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పూజలు నిర్వహించారు. కౌన్సిలర్ సైదులు గౌడ్, నాని యాదవ్ పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వినాయక మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో హనుమాన్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ప్రత్యేక పూజల్లో యువకులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ, పెద్దకార్పాముల హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేశుడి మండపం వద్ద సొంటె భాస్కర్, ప్రవీణ్‌లు అన్నదానం చేశారు.

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నైవేద్యం సమర్పించారు.



కల్వకుర్తిలో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం



తాడూరులో..



పెద్దకొత్తపల్లిలో ఎల్లమ్మ గుడి వద్ద ..



తెలకపల్లిలో గౌరారంలో..

దారారంలో వినాయక నిమజ్జనం

లింగాల: మండలంలోని దారారంలో ఆంజనేయ స్వామి ఆలయం పక్కన ఏర్పాటు చేసిన గణనాథుడిని శనివారం ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. యువకుల నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. అనంతరం ఊరకుంటలో నిమజ్జనం చేశారు. అంబట్‌పల్లిలో శివాలయం ఆవరణలో శివాలయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ రాథోడ్, సురేష్, సాయికుమార్, రవీందర్, విఘ్నేష్, తరుణ్, రవి, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



లింగాల దారారంలో..

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బల్మూర్: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి అన్నారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంతి, సూపర్‌వైజర్లు నిర్మల, వెంకటమ్మ, పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో పోషణ మాసోత్సవం

అమ్రాబాద్: మండలం కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సువర్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

దాడి చేసిన వారిపై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని నగారగడ్డతండాలో శనివారం కొర్రశాంతి, రాంజీలపై అదే తండాకు చెందిన లక్ష్మణ్, రాములు అకారణంగా దాడి చేశారు. ఈ మేరకు బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. ఇంటి తలుపులను ధ్వంసం చేసి దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

చారకొండ: మండలంలోని జూపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎండీ నజీర్ కుటుంబాన్ని శనివారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మెండె భిక్షపతి యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. గ్రామస్తులు సత్తూరి శ్రీనివాస్ గౌడ్, మహ్మద్, గౌస్, జక్కుల వెంకటయ్య తదితరులు ఉన్నారు.

సభ్యత్వాన్ని ఉద్యమంలా నిర్వహించాలి

కల్వకుర్తిరూరల్: బీజేపీ సభ్యత్వ నమోదును ఉద్యమంలా నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి రాఘవేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నర్సింహ అధ్యక్షతన బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులు కార్యకర్తలు సభ్యత్వ నమోదులో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దుర్గా ప్రసాద్, సభ్యత్వ నమోదు పట్టణ ఇన్‌చార్జి రాంచంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, రవిగౌడ్, వివేకానంద, గంగాధర్, బాబి, చందు ముదిరాజ్, లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో రాఘవేందర్‌గౌడ్ తదితరులు

ఘనంగా హిందీ దివస్



వెల్దండ: మండలంలోని గుండాలలో ఏకలవ్య పాఠశాల్లో శనివారం హిందీ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులు హిందీ అక్షరాల్లో కూర్చొని ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుమన్, ఉపాధ్యాయులు శంకర్‌లాల్, భాస్కర్, గజేందర్, కురుమయ్య, కీర్తి, రీనా, వేద్‌పాల్, సుధీర్, నాగేష్, విద్యార్థులు ఉన్నారు.

పౌరహక్కుల నేతల అరెస్ట్ అప్రజాస్వామ్యం



మాట్లాడుతున్న కేఎన్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు లక్ష్మీనారాయణ

మన్ననూర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రఘునాథ పాలెంలోని అటవీ ప్రాంతంలో గత వారం రోజుల కిందట జరిగిన ఎన్‌కౌంటర్‌కు సంబంధించి నిజా నిజాలు తెలుసుకునేందుకు శనివారం వెళ్లిన పౌరహక్కుల నేతలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యమని కేఎన్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు ముద్దునూరి లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మన్ననూర్‌లోని అంబేడ్కర్ గ్రంథాలయం ఆవరణలో ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ ఎడ్ల అంబయ్య, తెలంగాణ నిర్వాసిత పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ గోరటి నాగరాజుతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లా మణుగూరులో అరెస్ట్ చేసిన పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నక్క నారాయణలతో పాటు 14 మంది పౌర హక్కుల సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రాచరిక పాలన కొనసాగుతోందన్నారు. అక్రమ అరెస్ట్‌లు అన్యాయమని పేర్కొన్నారు.

నిరుపయోగంగా క్రీడా మైదానాలు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో అట్టహాసంగా గత ప్రభుత్వం క్రీడా మైదానాలను ఏర్పాటు చేసింది. నిర్వాహణ లేకపోవడం వల్ల బోర్డులకే పరిమితమయ్యాయి. క్రీడల నిర్వహణ కోసం గత కేసీఆర్ ప్రభుత్వం స్పోర్ట్స్ కిట్లను ప్రతి గ్రామ పంచాయతీకి అందజేసింది. ఇప్పటికి క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేయలేదు. ఆదరబాదరగా క్రీడా బోర్డులు తగిలేశారు తప్పా వాటి నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. దీంతో గ్రామీణ యువకులు క్రీడలపై ఆసక్తి చూపడం లేదు. మండలంలోని పాలుమూరు ప్రాథమిక పాఠశాల ఎదుటనే క్రీడా మైదానం అంటూ బోర్డు ఏర్పాటు చేసినా అక్కడ క్రీడలకు సరిపడ స్థలం లేదు. ఎంగంపల్లిలో క్రీడామైదానంలో కంపచెట్లు పెరగడంతో ఆడేందుకు వీలులేకుండా పోయింది. ప్రభుత్వ ఒత్తిడితో అప్పటి అధికారులు స్థలం లేకపోయినా బోర్డులు ఏర్పాటు చేశారు. ఇకనైనా అధికారులు ప్రజాప్రతినిధులు గుర్తించి క్రీడా మైదానాలు ఉపయోగంలోకి వచ్చే విధంగా చూడడంతో పాటు క్రీడలకు ఇచ్చిన కిట్లను ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల క్రీడాకారులు కోరుతున్నారు.



ఎంగంపల్లిలో ఏర్పాటు చేసిన క్రీడామైదానం బోర్డు

రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీతకు సన్మానం



రఘురామారావు దంపతులను సన్మానిస్తున్న రాజేందర్ తదితరులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో శనివారం సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ కల్వకుర్తి డివిజన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రఘురామారావును సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌జీటీల సంఘం జిల్లా నాయకుడు రాజేందర్ మాట్లాడుతూ ఎస్జీటీల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు అందుకోవడం గర్వకారణం అన్నారు. ప్రకాశ్, వెంకటయ్య, పర్వతాలు, సందీప్, భాస్కర్, శ్రీను, ఫరూఖ్ తదితరులు ఉన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న శ్రీశైలం

కొల్లాపూర్: ప్రణాళికతో చదవితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రేరణ విద్యాఉద్యమ వ్యవస్థాపకుడు శ్రీశైలం అన్నారు. శనివారం పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు ప్రేరణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ లక్ష్య సాధన కోసం ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లాలన్నారు. ప్రయత్నిస్తే అన్ని సాధ్యమేనన్నారు. సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, అనార్థాలను ఆయన వివరించారు. వార్షిక పరీక్షలకు, పోటీపరీక్షలకు మధ్య ఉండే వ్యత్యాసాలను, వాటికి ప్రిపేర్ అయ్యే విధానాలను ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు జ్యోతి, నజీమాబేగం, శైలజ, శ్యామల, దివ్యజ్యోతి తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా మలుపులు



కోడేరు నుంచి కొల్లాపూర్ వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మలుపు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- సూచిక బోర్డులు లేక అవస్థలు

కోడేరు: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మండలంలోని నాగులపల్లి, ముత్తిరెడ్డిపల్లి, మాచుపల్లి, రాజాపూర్, కొండ్రావుపల్లి, జనుంపల్లి, తీగలపల్లి రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు మూల మలుపుల వద్ద కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. వాహనాలు అదుపు తప్పి పలువురికి గాయాలైన ఘటనలు ఉన్నాయి. మూల మలుపుల వద్ద ఆర్ అండ్‌బీ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.



కొల్లాపూర్ నుంచి నాగర్‌కర్నూల్ వెళ్లే రహదారిలో..

బిక్కుబిక్కుమంటూ ప్రయాణం

మలుపుల వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. మండల కేంద్రం నుంచి నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా మలుపులు ఉన్నాయి. రాత్రివేళలో ద్విచక్ర వాహనదారులు సహితం ప్రమాదాల బారిన పరిస్థితి నెలకొందని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రయాణికులు వాహనదారులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



ప్రమాదకరంగా మూలమలుపులు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండల కేంద్రం మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రోడ్ల వెంట సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వీడాలి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– దానయ్య, కోడేరు

సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం..

మండలంలో ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్ల వద్ద ఉన్న మూలమలుపుల దగ్గర సూచిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రమాదకరంగా ఉన్న మలుపులను త్వరగా గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– రమాదేవి, ఆర్‌అండ్‌బీ డీఈ

తవ్వారు..వదిలేశారు

తాడూరు: మండల కేంద్రం నుంచి యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్ మీదుగా సిర్సవాడ వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డు మండల ప్రభుత్వ భవనాల సముదాయం ఎదుట వైపై కేబుల్ కోసం రోడ్డు పక్కనే గుంత తవ్వి వదిలేశారు. గుంతను పూడ్చకపోవడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు పరిశీలించి తాత్కాలికంగా గుంతను పూడ్చివేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన ఉన్న గుంత

వీధి కుక్కల బెడద



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో వీధికుక్కల బెడద రోజురోజుకు అధికమవుతోంది. గుంపులుగుంపులుగా సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్లపై వెళ్తున్న వాహనదారులను వెంటబడుతున్నాయి. పలువుతు కుక్కకాటుతో ఆస్పత్రిపాలైన ఘటనలు ఉన్నాయి. బస్టాండ్‌లో కుక్కల బెడద అధికంగా ఉందని ప్రయాణికులు వాపోయారు. అధికారులు స్పందించి వీధికుక్కలను పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.



వరద బాధితుల సహాయార్థం సీఎం రేవంత్ రెడ్డికి రూ.5 కోట్ల చెక్ ఇస్తున్న దివిస్ ల్యాబొరేటరీ సీఈవో డాక్టర్ కిరణ్

టైమ్స్ ప్రాపర్టీ షో ప్రారంభం



మాదాపూర్ (హైదరాబాద్): మాదాపూర్‌లోని హైటెక్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న టైమ్స్ ప్రాపర్టీ ఎక్స్‌పో–2024 శనివారం ప్రారంభమైంది. అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ బ్రాండ్ మేనేజర్ వెంకట్ రవి, లాన్సన్ ఎస్ పాయింట్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కియా కార్యంకర్, రాజపుష్ప ప్రాపర్టీస్ కార్తీక్ తదితరులు ప్రాపర్టీ షోను ప్రారంభించారు. ఎక్స్‌పోలో 50 మంది ప్రసిద్ధ డెవలపర్‌లు.. 150కి పైగా ప్రాజెక్టులను అందుబాటులో ఉంచారు. నగరంలో ప్రముఖ ప్రాజెక్టులు, అందుబాటులోని విల్లాలు, అపార్ట్‌మెంట్లు ప్లాట్ల సమాచారాన్ని సందర్శకులకు వివరిస్తున్నారు. కార్యక్రమంలో హోనర్‌హోమ్స్ ఐశ్వర్య, అంకురా హోమ్స్ అవినాశ్, రాదేయ్ కన్‌స్ట్రక్షన్ మహమ్మద్‌గౌస్ అలీ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో కేజ్రీవాల్ పూజలు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ శనివారం కన్నాట్ ప్లేస్‌లోని ప్రఖ్యాత హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. భార్య సునీతతో పాటు వచ్చిన ఆయన ఆలయంలో పూజలు చేసి, ఆశీర్వచనం అందుకున్నారు. ఆప్ నేతలు, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ కూడా వారి వెంట ఉన్నారు. మద్యం కుంభకోణం కేసులో సుప్రీంకోర్టు బెయిలివ్వడంతో కేజ్రీవాల్ శుక్రవారం తీహార్ జైలు నుంచి విడుదలైన విషయం తెలిసిందే. అదేవిధంగా, కేజ్రీవాల్ తన నివాసంలో సుప్రీం కోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో చర్చలు జరిపారు.

డీమ్డ్ మెడికల్ కాలేజీలపై సర్కారు గరం

- యూజీసీ తీరును తప్పుబడుతున్న ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయం
- అవసరమైతే కోర్టుకు వెళ్లేలా యోచన
- 'సాక్షి' కథనం నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ స్పందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు మెడికల్, డెంటల్ కాలేజీలకు డీమ్డ్ యూనివర్సిటీ హోదా ఇస్తున్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీరుపై రాష్ట్ర సర్కార్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయా లని భావిస్తోంది. అవసరమైతే కోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. శనివారం 'సాక్షి' లో 'వైద్య విద్య సీట్లపై ప్రైవేట్ కన్ను' శీర్షికతో ప్రచురితమైన కథనంపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో కన్వీనర్ కోటా, రిజర్వేషన్ కోటా సీట్లు తగ్గిపోయి మెరిట్, పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు మంత్రికి ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి, ఈ అంశం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, డీమ్డ్ వర్సిటీలను అడ్డుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్టుగా విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. దీనిపై కాళోజీ యూనివర్సిటీ అధికారులతోనూ మంత్రి సమీక్ష చేసినట్టు తెలిసింది. యూజీసీ తీరు బడుగు, బల హీన వర్గాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు తీరని అన్యాయం చేసే విధంగా ఉందని మంత్రి వ్యాఖ్యానించినట్టు అధికారులు చెబుతున్నారు.

'మల్లారెడ్డి' బాటలో మరికొన్ని కాలేజీలు!

మల్లారెడ్డి మెడికల్ కాలేజీలు, డెంటల్ కాలేజీలకు డీమ్డ్ వర్సిటీ హోదాను ఇస్తూ ఇటీవలే యూజీసీ నిర్ణయం తీసుకుంది. ఫీజుల ఖరారు, పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల మూల్యాంకనం వంటివన్నీ వర్సిటీ హోదాలో సొంతంగా చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. తెలంగాణ స్థానిక కోటా అమలు చేయాల్సిన అవసరం లేకుండా మినహాయింపులు ఇచ్చింది. దీంతో మల్లారెడ్డి కాలేజీల్లో ఉన్న 400 ఎంబీబీఎస్ సీట్లు, సుమారు 150 బీడీఎస్ (డెంటల్) సీట్లు పూర్తిగా మేనేజ్‌మెంట్ కోటాలోకి వెళ్లిపోయాయి. గతేడాది వరకూ ఇందులో సగం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేసేవారు. నీట్‌లో మంచి ర్యాంక్ సాధించిన ప్రతిభగల విద్యార్థులకు ఈ సీట్లు దక్కేవి. ర్యాంకు సాధించిన పేద విద్యార్థులకు ఉచితంగా మెడిసిన్ చదివే అవకాశం దక్కేది. మేనేజ్‌మెంట్ కోటా సీట్లలోనూ 85 శాతం తెలంగాణ విద్యార్థులకే కేటాయించేవారు. కానీ ఇకపై ఈ నిబంధనలు ఏవీ పాటించాల్సిన అవసరం లేకుండా యూజీసీ 'మల్లారెడ్డి'కి మినహాయింపులు ఇచ్చింది. 'మల్లారెడ్డి'చూపిన బాటలో అపోలో, సీఎంఆర్ కాలేజీలు కూడా డీమ్డ్ హోదా కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి దామోదర దీనిపై సీరియస్‌గా దృష్టి పెట్టారు.

కోట్లలో ఆదాయం!

డీమ్డ్ యూనివర్సిటీ హోదా తెచ్చుకుంటున్న మెడికల్ కాలేజీలకు రూ. వందల కోట్ల లబ్ధి చేకూరుతోంది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీటు ఫీజు రూ. 60 వేలు మాత్రమే ఉండగా, మేనేజ్‌మెంట్ కోటా ఫీజు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రెగ్యులేటరీ కమిటీ ఫీజులను నిర్ణయిస్తోంది. అయితే డీమ్డ్ యూనివర్సిటీలు ఈ కమిటీతో సంబంధం లేకుండా, సొంతంగానే తమ ఫీజులను నిర్ణయించుకునే అధికారాన్ని యూజీసీ కల్పిస్తోంది. మల్లారెడ్డి మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ ఫీజు సంవత్సరానికి రూ.17.5 లక్షలుగా ఉన్నట్టు కాళోజీ అధికారులు చెబుతున్నారు. గతంలో కన్వీనర్ కోటా ఫీజు కింద 200 సీట్లకు ఏడాదికి రూ.1.2 కోట్లు వస్తే, ఇప్పుడు అవే 200 సీట్లకు ఏడాదికి రూ.35 కోట్ల ఆదాయం వస్తుంది. ఒక్క బ్యాచ్ పూర్తయ్యేసరికి ఏకంగా రూ.175 కోట్లు సమకూరుతుంది.

సీబీఎస్‌ఈకీ మంగళం!



ఏపీలో పేదల విద్యపై చంద్రబాబు ప్రభుత్వ కక్ష సాధింపు

- ఈ పరీక్షలు రద్దుచేస్తూ నిర్ణయం
- రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో తిరోగమనంలో పాఠశాల విద్య
- మాజీ సీఎం జగన్‌పై కోపాన్ని పేద పిల్లలపై చూపుతున్న సర్కారు

సాక్షి, అమరావతి: మొన్న టోఫెల్.. నిన్న ఐబీ.. నేడు సీబీఎస్‌ఈ.. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో ఉన్నతాశయంతో పేద విద్యార్థుల భవిష్యత్తుకు వీటి ద్వారా బంగారు బాటలు వేస్తే ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం వాటిని ఒక్కొక్కటిగా అటకెక్కిస్తోంది. రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలన్న సత్సంకల్పంతో విద్యారంగంలో జగన్ అనేక సంస్కరణలు అమలుచేస్తే.. ఆయన మీద అక్కసుతో చంద్రబాబు సర్కారు పేద విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తూ పాఠశాల విద్యను తిరోగమనం బాట పట్టిస్తోంది. ఇందులో భాగంగా.. జగన్ అమలుచేసిన ఒక్కో అంశానికీ స్వస్తి చెబుతోంది. టోఫెల్, ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) బోధనకు ఇప్పటికే చరమగీతం పాడిన ఈ ప్రభుత్వం అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన ఊసెత్తడంలేదు. తాజాగా.. సీబీఎస్‌ఈ బోధనకూ తూచ్ అంటూ పేద పిల్లలకు అందుతున్న నాణ్యమైన విద్యను దూరం చేస్తోంది. ప్రభుత్వబడుల పీక పిసికేస్తోంది.

విద్యా సంవత్సరంలో మధ్యలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ బడులను అద్భుతంగా తీర్చిదిద్ది తల్లిదండ్రుల్లోను, విద్యార్థుల్లోను వాటిపై పెంచిన నమ్మకాన్ని చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా గత విద్యా సంవత్సరంలో వైఎస్ జగన్ సర్కారు 1,000 ప్రభుత్వోన్నత పాఠశాలల్లో సీబీఎస్‌ఈ బోధనను అమల్లోకి తెస్తే.. చంద్రబాబు సర్కారు ఈ విద్యా సంవత్సరం మధ్యలో దానిని రద్దుచేసేసింది. అధికారంలోకి రాగానే ఇంగ్లిష్ మీడియం రద్దుచేస్తామని మొన్నటి ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు బహిరంగంగా చేసిన ప్రకటనకు అనుగుణంగానే ఆయనిప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. అలాగే, విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన 'టోఫెల్'శిక్షణను అధికారంలోకి వచ్చీరాగానే జూన్‌లో రద్దుచేసి పారేశారు. ఇప్పుడు కొత్తగా ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులు సీబీఎస్‌ఈ ప్రమాణాలను అందుకోలేకపోతున్నారని చెబుతూ 1,000 ప్రభుత్వ పాఠశాలల్లో అమల్లోకి తెచ్చిన సీబీఎస్‌ఈ బోధనను రద్దుచేశారు. అలాగే, విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న సాకుతో అక్కడి ఉపాధ్యాయులను సర్దుబాటు పేరుతో బదిలీ చేసింది. ఇలా ప్రభుత్వ నిరంకుశ విధానాల కారణంగా.. ఇంగ్లిష్ మీడియం కోరుకునే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లిపోతున్న పరిస్థితి రాష్ట్రంలో దాపురించింది.

జగన్‌పై కోపంతోనే విద్యపై అక్కసు..

'పేదలకు ఉచితంగా చదువు చెప్పడం ప్రభుత్వ బాధ్యత కాదు, ప్రభుత్వ బడుల్లో సదుపాయాలు ఉండవు, ప్రైవేటు బడులు బాగుంటాయి. డబ్బున్నవారు అక్కడ చదువుకుంటారు, మీరూ ఫీజులు కట్టి ప్రైవేటు స్కూళ్లకు వెళ్లండి'.. అని గతంలో సీఎం హోదాలో చంద్రబాబు బహిరంగంగా అన్నారు. దాదాపు 40 ఏళ్ల రాజకీయ అనుభవం, రాష్ట్రానికి 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన ఆయనకు పేదలన్నా.. పేదల పిల్లల చదువులన్నా ఎంత చులకనో ఈ మాటలే చెబుతున్నాయి. ఆయన తన నైజాన్ని మరోసారి రుజువు చేసుకుంటూ పేదల విద్యను నిర్వీర్యం చేసే చర్యలకు పూనుకున్నారు. ఇందులో భాగంగానే కార్పొరేట్ విద్యా సంస్థలకు బాహాటంగా కొమ్ముకాస్తూ రాష్ట్రంలో పేద పిల్లల చదువును పూర్తిగా అంధకారంలోకి నెట్టేస్తున్నారు. ఉదా.. గతంలో తక్కువ మంది విద్యార్థులున్నారని 2014–19 మధ్య 1,785 పాఠశాలలను మూసివేసి అక్కడి విద్యార్థులను గాలికొదిలేశారు. అలాగే, 4,300 ప్రభుత్వ పాఠశాలలను ఆయన హయాంలోనే మూసివేశారు. ఇప్పుడు వైఎస్ జగన్‌పై కోపంతో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ బోధనకు సైతం అదే గతి పట్టించారు.

విద్యా సంస్కరణలకు జగన్ శ్రీకారం..

పిల్లలకు మనమిచ్చే ఆస్తి ఏదైనా ఉందంటే అది నాణ్యమైన విద్య మాత్రమేనని, పేదరికం పోవాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని బలంగా నమ్మిన వైఎస్ జగన్ తన పాలనలో విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పేదింటి పిల్లలు అంతర్జాతీయంగా రాణించాలంటే వారికి ఇంగ్లిష్ మీడియం బోధన ఉండాలని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఏడాదికి ఒక తరగతి చొప్పున పెంచుతూ ఇంగ్లిష్ మీడియం అమలుచేశారు. మరోపక్క... ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు 'టోఫెల్'ను సిలబస్‌లో అంతర్భాగం చేశారు. మరోపక్క.. జాతీయ విద్యా విధానం–2020లో భాగంగా రాష్ట్రంలోని ఎక్కువమంది విద్యార్థులకు సీబీఎస్‌ఈ విద్యను అందించేందుకు 1,000 ప్రభుత్వోన్నత పాఠశాలల్లో 2023–34 విద్యా సంవత్సరంలో 9వ తరగతి నుంచి సీబీఎస్‌ఈ బోధనను అందుబాటులోకి తెచ్చారు. దీంతో దాదాపు 84 లక్షల మంది విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరంలో సీబీఎస్‌ఈ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఒక యూనిట్ పరీక్షలు కూడా ముగిసిన తర్వాత ఉన్నపళంగా రాష్ట్ర ప్రభుత్వం సీబీఎస్‌ఈ పరీక్షా విధానం రద్దు చేసి విద్యార్థులను గందరగోళంలోకి నెట్టేసింది.

పదేళ్లు అధికారంలో ఉంటాం

▶ మొదటి పేజీ తరువాయి

నిరంతరం విషం చిమ్ముతుంటారని.. ప్రజల పక్షాన మాట్లాడేవారి కంటే విషం చిమ్మేవారు ఎక్కువైపోయారని వ్యాఖ్యానించారు. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మజ్లిస్ కలిసి రావడం ఆనందంగా ఉంది

ప్రభుత్వాన్ని నడిపించడంలో కొన్ని తప్పిదాలు జరగవచ్చని, వాటిని ఎత్తి చూపేందుకు బలమైన ప్రతిపక్షం అవసరమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, తర్వాత అభివృద్ధి, సంక్షేమంలో అంతా కలిసి రావాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ రాజకీయంగా విభేదించినా.. తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కలసి రావడం అనందంగా ఉందని చెప్పారు. మూసీ నది అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో కొందరు పేదలు నివాసాలు కోల్పోయే అవకాశం ఉందని, వారికి ప్రభుత్వపరంగా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని రేవంత్ ప్రకటించారు. అన్ని మతాలు చెప్పింది ఒక్కటేనని, అందరం కలసిమెలసి శాంతియుతంగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని రేవంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టెమ్రిస్ వైస్‌చైర్మన్ ఫహీమ్ ఖురేషీ, ఇస్లామిక్ స్కాలర్స్ పాల్గొన్నారు.

నకిలీ ఇళ్ల పట్టాల కేసులో కీలక మలుపు

పరారీలో శ్రీకాంత్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రైం: కొన్ని రోజుల నుంచి పాలమూరులో హాట్‌టాపిగా ఉన్న సర్వేనంబర్ 523లో నకిలీ పట్టాల ఇళ్ల వ్యవహారంలో కీలక మలుపు చోటుచేసుకుంది. నకిలీ పట్టాలు తయారు చేసి రూ.లక్షలు వసూలు చేసి అమాయక బాధితులను మోసం చేసిన ముగ్గురు వ్యక్తులను ఇప్పటికే రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్న ఏ–4 శ్రీకాంత్‌గౌడ్ పరారీలో ఉన్నారని రూరల్ సీఐ గాంధీనాయక్ 'సాక్షి'కి తెలిపారు. అతడిపై 420, 468, 471, 474తో పాటు మరి కొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. ఇప్పటి వరకు అదుపులోకి తీసుకోలేదని, ప్రస్తుతం పరారీలో ఉన్నాడని తెలిపారు. సమయం లేకపోవడం వల్లే నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్ట లేకపోయామని వివరించారు.

పోలీసుశాఖపై విమర్శలు

సాధారణ దొంగతనాలు, చిన్న పాటి కేసులకు హడావుడి చేసి ప్రెస్‌మీట్‌లు ఏర్పాటు చేసి, నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచే పోలీసులు..అత్యంత కీలకమైన ఆదర్శనగర్ సర్వేనంబర్ 523 ఇళ్ల వ్యవహారంలో వారు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసులో నిందితులను మీడియా ఎదుట చూపించకుండా రాత్రి వేళ చడి చప్పుడు కాకుండా ప్రెస్‌నోట్ రిలీజ్ చేసి చేతులు దులుపుకున్నారు. నిందితుల నుంచి సీజ్ చేసి నకిలీ పట్టాలు కానీ, ముద్రలు, కారు ఏ ఒక్కటి కూడా వెలుగులోకి తీసుకురాకుండా గోప్యంగా ఉంచారు. ఈ వ్యవహారంలో రాజకీయ పార్టీ నేతల భాగస్వామ్యం ఉండటంతో సమాచారం బయటకు రాకుండా జాగ్రత్తపడుతున్నారని తెలిసింది.

పిల్లలను బాధ్యతతో పెంచాలి

పాలమూరు: పిల్లలను పెంచడం అనేది జీవితంలో ఎంతో బాధ్యతతో కూడుకున్న వ్యవహారమని గద్వాల జిల్లా డీటీఓ ఉమాదేవి అన్నారు. సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఫోరం కార్యాలయంలో మహిళ సీనియర్ సిటిజన్ ఫోరం సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల చుట్టు ఉన్న ప్రపంచంలో సంక్లిష్టతలను విశ్లేషన చేయగల బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు నాగశ్రీ, సరోజ, చంద్రకళ, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతి రావు, ప్రొద్దటూరి ఎల్లారెడ్డి, నాగభూషణం, రాజసింహుడు,నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తరలింపు టెండర్ల రద్దు

- ఈనెల 11న టెండర్ వేయకుండా మహిళ అడ్డగింత
- హైకోర్టును ఆశ్రయించిన బాధితురాలు



టెండర్ రోజు సివిల్ సప్లయ్ కార్యాలయం ఎదుట జరిగిన రభస (ఫైల్)

నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సివిల్ సప్లయ్ కార్యాలయంలో ఈ నెల 11న ధాన్యం తరలింపు కోసం నిర్వహించిన టెండర్ల వద్ద పెద్దఎత్తున రభస జరిగిన విషయం తెలిసిందే. అధికార పార్టీకి చెందిన కొందరు టెండర్ తమకే దక్కాలని.. మరొకరు టెండర్‌లో పాల్గొనకుండా నీరజ అనే మహిళను అడ్డుకున్నారు. సదరు మహిళ టెండర్ వేసేందుకు ప్రయత్నించినా సమయం ముగిసే వరకు నిలువరించారు. అయితే ఈ తతంగమంతా పోలీసులు, అధికార యంత్రాంగం ముందు జరిగినా పట్టించుకోలేదని ఆమె ఆరోపించింది. టెండర్ వేయకుండా అడ్డుకున్న రోజే నీరజ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పెద్దగా స్పందన లేకుండా పోయింది. దీంతో టెండర్ల ప్రక్రియ సక్రమంగా జరగలేదని, వాటిని రద్దు చేసి మరోమారు పారదర్శకంగా నిర్వహించాలని కోరుతూ నీరజ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో టెండర్ రద్దు చేయాలని కోర్టు సివిల్ సప్లయ్ శాఖ అధికారులను ఆదేశించింది.

నాలుగు డివిజన్లలో..

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు సరఫరా చేసేందుకు రవాణా కోసం సివిల్ సప్లయ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ నెల 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత 11న టెండర్ దారుడు దరఖాస్తు ఫారాలను సంబంధిత ధ్రువపత్రాలను జతపరిచి నేరుగా కార్యాలయం వద్ద ఉన్న బాక్స్‌లో వేయాలి. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తికి డివిజన్‌లకు సంబంధించి టెండర్‌లను ఆహ్వానించారు. నిబంధనల ప్రకారం టెండర్‌దారుడికి సొంతంగా పది ఫిట్‌నెస్ కలిగిన లారీలు, మరో 15 అద్దె లారీలు ఉండాలి. 0– 10 కిలోమీటర్ల వరకు తరలిస్తే రూ.250, అదనంగా తిరిగితే అదనంగా చెల్లించేలా బేసిక్ ధరలు నిర్ణయించారు. టెండర్‌లో తక్కువ ధరకు కోట్ చేసిన వారికి ఈ టెండర్ దక్కే అవకాశం ఉంటుంది. అయితే పోటీ ఉంటే ఎక్కువ లాభం రాదనే విషయాన్ని గమనించిన కొందరు అధికార పార్టీ నాయకులు నీరజ అనే టెండర్ దారుని అడ్డుకున్నారు. ఆమె టెండర్ నుంచి ఫారాలను దొంగిలించడం, కారులోంచి దిగకుండా అడ్డుకోవడంతో టెండర్ సమయం పూర్తయింది.

కథ అడ్డం తిరిగింది..

టెండర్ విషయంలో నానా రభస చేసి టెండర్ దక్కించుకోవాలని చూసిన వారు కథ సాఫీగా జరుగుతుందని ఆశించారు. కానీ, ఊహించని రీతిలో కథ అడ్డం తిరిగింది. అందరూ కలిసి అడ్డుకున్న నీరజ హైకోర్టును ఆశ్రయించడంతో టెండర్‌ను రద్దు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

మెయిల్ ద్వారా ఆదేశాలు..

ఈ నెల 11న జరిగిన ధాన్యం రవాణా టెండర్లను రద్దు చేయాలన్న హైకోర్టు ఆదేశాలు మెయిల్ ద్వారా అందుకోవడం జరిగింది. దీనికి సంబంధించి ఆ రోజు జరిగిన నాలుగు డివిజన్ల టెండర్లను రద్దు చేసే అవకాశం ఉంటుంది. తదుపరి అదనపు కలెక్టర్ ఆదేశాలను అనుసరిస్తాం.

– రాజేందర్, సివిల్ సప్లయ్, డీఎం

మళ్లీ నిర్వహించాలి..




ఈ నెల 11న ధాన్యం రవాణా టెండర్లలో పాల్గొనేందుకు వెళ్తే నా ఫారాలు లాక్కొని టెండర్ వేయకుండా అడ్డుకున్నారు. పోలీసులు, అధికారులు సైతం వారికి సహకరించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. నాలుగు డివిజన్ల టెండర్లు రద్దు చేసి పారదర్శకంగా రీటెండర్ నిర్వహించాలి.

– నీరజ, టెండర్‌దారు

మరోసారి ఎక్కడికీ వెళ్లొద్దు

ఇంటికి చేరుకున్న సుఫియాన్‌కు ఎమ్మెల్యే సూచన



ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపిన సుఫియాన్

నారాయణపేట: రష్యా ఆర్మీలో చిక్కుకున్న నారాయణపేటకు చెందిన సుఫియాన్ సురక్షితంగా శుక్రవారం సాయంత్రం ఇంటికి చేరుకున్న తర్వాత శనివారం సీవీఆర్ భవన్‌లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డిని కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సుఫియాన్ అదృష్టం బాగుంది.. తమ ప్రయత్నం ఫలించినందుకు సంతోషిస్తున్నాం.. జహీర్ బై తుమ్ అచ్చా రహో.. బచ్చాకో అచ్చా దేఖ్‌లేవ్ అంటూ సుఫియాన్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. అసలు ఆ రష్యా ఆర్మీకి ఎలా వెళ్లారని సుఫియాన్‌ను ఎమ్మెల్యే అడిగారు. అందుకు ఆయన సమాధానం ఇచ్చారు. ఓ యూట్యూబ్ చానల్ ద్వారా పరిచయమైన ఏజెంట్ ద్వారా దుబాయ్‌కి వెళ్లానని.. అక్కడ రష్యాకు వెళ్తే.. అక్కడ ఇదే హోటల్ ఉద్యోగంతో రూ.లక్షకు పైగా జీతం వస్తుందని చెప్పడంతో వెళ్లామన్నారు. అక్కడికి వెళ్లిన తర్వాత అసలు విషయం తెలిసిందన్నారు. మాస్కో నుంచి బార్డర్‌లో తీసుకెళ్లి ఘన్ పట్టించారన్నారు. ఓ హైదరాబాద్ యువకుడు తనతో పాటు వచ్చాడని.. ఉక్రెయిన్, రష్యాయుద్ధ వాతావరణంలో కళ్ల ముందే చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశాడు. దేశానికి చెందిన గుజరాత్ యువకుడు సైతం మృతిచెందాడని తెలిపారు. నన్ను ప్రాణాలతో బతికించి ఇంటికి చేరుకునేంత వరకు ప్రయత్నించిన తమరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానంటూ ఒకింత కళ్లలో నీళ్ల తెచ్చుకున్నాడు. ఇలాంటి మోసపూరితమైన యూట్యూబ్ చానళ్లను నమ్మి మరో సారి ఎక్కడికి వెళ్లవద్దని ఎమ్మెల్యే సూచించారు. కృతజ్ఞతతో ఎమ్మెల్యేను సన్మానించేందుకు సుఫియాన్ శాలువా తీయగా.. ఆ శాలువాతో సుఫియాన్‌ను ఎమ్మెల్యే సన్మానించి స్వీట్లు తినిపించడంతో బాధిత యువకుడి కుటుంబం సంబరపడ్డారు. కౌన్సిలర్లు మహేశ్, సరిత, మాజీ కౌన్సిలర్ నావాజ్ ముసా, సర్ఫారాజ్ అన్సారీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

వ్యక్తికి రిమాండ్

వనపర్తి రూరల్: చోరీకి పాల్పడిన కేసులో వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు వనపర్తి పట్టణంలోని సీఐ కార్యాలయంలో సీఐ నాగభూషణ్‌రావు, ఎస్‌ఐ శ్రీరామ్‌లు విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. రేవల్లి మండలం కొంకలపల్లి, బండరావిపాకుల బస్‌స్టాప్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించగా అనుమానాస్పదంగా వ్యక్తి కనిపించాడు. అతను రేవల్లి మండలం, నాగపూర్ గ్రామానికి చెందిన కుడికిల్ల మల్లేష్‌గా గుర్తించారు. శనివారం ఉదయం నాగపూర్ బస్‌స్టాఫ్‌లో కనిపించడంతో అతన్ని అదుపులోకి తీసుకొని రేవల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. ఈనెల 10న రేవల్లి మండలం కొంకలపల్లికి చెందిన బోయ వెంకటేష్ కుటుంబంతో కలిసి చారగొండ మల్లన్న గుడికి వెళ్లారు. ఆ రోజు రాత్రి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో రూ.30 వేలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నెలరోజుల క్రితం శానాయిపల్లిలో ఓ ఇంట్లో బీరువాలో రూ.70 వేలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. 2019లో అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ చేసి పట్టుబడి నెలరోజులు జైలు శిక్ష అనుభవించినట్లు పేర్కొన్నాడు. నిందితున్ని అరెస్టు చేసి రూ.23 వేలు స్వాధీనం చేసుకోని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన సీఐని, ఎస్‌ఐని, సిబ్బందిని ఎస్పీ రావుల గిరిధర్ అభినంది, రివార్డు అందజేశారు.

జూరాలకు 52,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



కళకళలాడుతున్న జూరాల ప్రాజెక్టు రిజర్వాయర్

ధరూరు: జూరాలకు ఇన్‌ఫ్లో మరింత తగ్గు ముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రానికి 52,800 క్యూసెక్కులకు తగ్గిన ట్లు వివరించారు. 4 గేట్ల ద్వారా 16,512 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అయితే శనివారం రాత్రి 9.15 గంటల ప్రాంతంలో గేట్లన్నీ మూసివేసినట్లు వివరించారు. ఇదిలా ఉండగా విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్లను కొనసాగించి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఇందుకోసం 38,849 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. కాగా శనివారం మొత్తంగా వివిధ రూపాలలో 58, 435 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.070 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 5 గేట్ల ద్వారా 20,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. పూర్తిస్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా...ప్రస్తుతం ప్రాజెక్టులో 32.984 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు.

విద్యుదుత్పత్తిలో లక్ష్యం వైపు అడుగులు..

ఆత్మకూర్: జూరాలలో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతోందని జెన్‌కో సివిల్, ఎలక్ట్రికల్ ఎస్ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఈ ఏడాది ఎగువ, దిగువల్లో 600 మిలియన్ యూనిట్ల లక్ష్యం ఉండగా.. ఇప్పటికే సగం వరకు విజయవంతంగా చేరుకున్నామని వివరించారు. ఎగువ నుంచి వరద నీరు చేరడంతో దిగువ విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేపట్టలేకపోయామని అన్నారు. కాగా ఇదే స్థాయిలో వరద కొనసాగితే ఈ ఏడాది వందశాతం లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. 11 యూనిట్లద్వార విద్యుదుత్పత్తిని చేపడుతున్నామని వివరించారు. ఇప్పటివరకు 307.339 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించామని తెలిపారు.

శ్రీశైలంలో నీటిమట్టం 884.0 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం నీటిమట్టం 884.0 అడుగుల వద్ద 210.0320 టీఎంసీలుగా ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 73,381 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వైపు వస్తోంది. కాగా భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,116 క్యూసెక్కులు, ఏపీ.జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,094.. మొత్తం 68,210 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 25,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,420 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎంజీకేఎల్ఐకు నీటి విడుదల జరగలేదు. భూగర్భ కేంద్రంలో 16.967 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.479 మి.యూనిట్లు ఉత్పత్తి చేశారు.

సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసులకు ఇన్ ఫ్లో తగ్గుముఖం పట్టింది. శనివారం ఎగువ నుంచి 20,361 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా..4 గేట్ల ద్వారా 17,916 క్యూసెక్కులను దిగువకు వదిలారు. కేసీ కెనాల్ కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

కోయిల్‌సాగర్‌లో 32.2 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో శనివారం సాయంత్రం వరకు 32.2 అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. మరో 0.4 అడుగుల నీరు చేరితే గేట్లు తెరిచే అవకాశం ఉంది. ఇప్పటికే రెండు వారాల నుంచి ప్రాజెక్టు గేట్లను తెరిచి నీటిని దిగువకు వదిలారు. పెద్దవాగు నుంచి వచ్చే ఇన్‌ఫ్లో రెండు రోజులుగా తగ్గిన కారణంగా ప్రాజెక్టు గేట్లను మూసివేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టు గరిష్ట స్థాయికి చేరే వరకు గేట్లను తెరిచే అవకాశం లేదు. అయితే గేట్లను మూసివేసినప్పటికీ కొన్ని గేట్ల కింద నుంచి నీరు జాలు వారుతోంది. వివిధ ప్రాంతాల నుంచి ప్రాజెక్టు వద్దకు పెద్దఎత్తున సందర్శకులు తరలివస్తున్నారు.